క్లుప్తంగా

కష్టపడేతత్వం అలవర్చుకోవాలి

మండల విద్యాధికారి గోపాల్



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న గోపాల్

పరిగి: విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని మండల విద్యాధికారి గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో హరిజన వాడలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిరంతరం మెరుగైన విద్యా బోధన చేయాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు.

సోదరభావంతో మెలగాలి

బీఆర్ఎస్ మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు శాంత కుమార్



రాఖీలు కడుతున్న విద్యార్థినులు

నవాబుపేట: విద్యార్థులందరూ సోదర భావంతో మెలగాలని బీఆర్ఎస్ మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు శాంత కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాఖీ జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాఖీ విశిష్టత ప్రతి ఒక్కరికీ తెలియాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజు, రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం, మైనార్టీ సంఘం అధ్యక్షుడు ఫిర్దోస్ ఖాన్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు అనిల్ కుమార్, కేసీఆర్ సేవాదళ్ అధ్యక్షుడు ఫతేపురం మాణిక్ రెడ్డి, సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి కే కుమార్, షాబాజ్, ప్రభుత్వ కళాశాల బీఆర్ఎస్వీ అధ్యక్షుడు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థులకు సూచనలందిస్తున్న అధ్యాపక, వైద్య సిబ్బంది

కొడంగల్ రూరల్: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ కె అమృత మాట్లాడుతూ ఏడాది వయస్సు నుంచి 19 ఏండ్లు కలిగిన వారు ఈ మాత్రలను తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ రాంబాబు, హెల్త్‌క్లబ్ కోఆర్డినేటర్ హరిప్రియ, అధ్యాపక సిబ్బంది రమేశ్, గోవిందాచారి, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ బ్రహ్మోత్సవాలు

వైభవంగా లక్ష్మీనారాయణ కల్యాణం



కల్యాణానికి హాజరైన మహిళలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం మారుతినగర్‌లోని వైభవలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామునుంచే అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం గణపతిపూజ నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో లక్ష్మీనారాయణ కల్యాణాన్ని వైభవంగా చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య చూడముచ్చటగా జరిపించారు. అనంతరం ప్రత్యేక హారతి ఇచ్చి తీర్థప్రసాదాలు, అన్నదానం చేపట్టారు.

నేడు రైతు బీమాకు ఆఖరు

తాండూరు రూరల్: రైతు బీమాకు దరఖాస్తు గడువు బుధవారంతో ముగుస్తోందని తాండూరు వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడీఏ కొమురయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు తాండూరు మండలంలో 260కి పైగా దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. పెద్దేముల్ మండలంలో కూడా 280కి పైగా దరఖాస్తులు వచ్చినట్లు ఏవో పవన్ ప్రీతం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నత్తనడక.. నిర్మాణ పనులు

ముందుకు సాగని ఇందిరమ్మ ఇళ్ల పథకం

- వర్షాలతో కష్టంగా మారిన ఇసుక లభ్యత
- త్వరగా పూర్తి చేయాలంటున్న అధికారులు
- వ్యవసాయ సీజన్ మొదలు కావడంతో వెనుకంజ



సందారంలో బేస్‌మెంట్ లెవల్‌లో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు

దౌల్తాబాద్: రాష్ట్రంలో అధికారంలోకొచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది. ఇళ్లు లేని ప్రతీ పేదవారికి ఇళ్లను మంజూరు చేయాలనే లక్ష్యంతో దీన్ని తీసుకొచ్చారు. ఈ పథకం మొదటి విడత నత్తనడకనా సాగుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో ప్రజలకు మోసం చేసిందని ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా అర్హులైన ప్రతీఒక్కరికి ఇంటిని నిర్మించి ఇస్తామని ప్రభుత్వ పెద్దలు హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో ఇంటిని నిర్మించేందుకు చాలా మంది మొగ్గు చూపించడంలేదు. ప్రారంభించిన వారు సైతం నిర్మాణ పనులను నెమ్మదిగా చేస్తుండడంతో అధికారులు లబ్ధిదారుల ఇళ్ల చుట్టూ తిరుగుతూ పనులు వేగంగా చేపట్టాలని సూచిస్తున్నారు.

జూన్ నుంచి సీజన్..

మండలంలో జూన్ నెల నుంచి వ్యవసాయ సీజన్ మొదలవుతుంది. గ్రామంలోని ప్రజలందరూ నిమగ్నమవుతారు. ఇళ్ల నిర్మాణ పనులతో పాటు పలు రకాల పనులను సైతం వాయిదా వేసుకొని వ్యవసాయ పనుల్లో బిజీగా ఉంటారు. ఈ పనులు ముగిసిన అనంతరం నవంబర్ నుంచి ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టొచ్చని భావించి కొందరు వాయిదా వేసుకుంటున్నారు. మరో పక్క వర్షాలు పడుతుండడంతో నిర్మాణ పనులకు ఆటంకంగా మారింది. దానికి తోడు మార్కెట్లో ఇసుక దొరకడం కష్టంగా ఉంది. అక్రమంగా ఇసుక తరలిస్తున్న కొందరు దళారులు ఇష్టారీతిన ధరలు పెంచి అమ్ముకుంటున్నారు. ఇసుక రేట్లు భారీగా ఉండడంతో పనులు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు.

అధికారుల ఒత్తిడి

ఇళ్లు మంజూరైన వారు వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం మొదటి విడత ఇళ్ల నిర్మాణ లక్ష్యం విజయవంతంగా పూర్తి చేసి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులపై భారం పెట్టింది. దీంతో వారు లబ్ధిదారులపై ఒత్తిడి చేయక తప్పడంలేదు. ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించిన సందర్భంగా మొదటి విడత నగదు ఖాతాల్లో జమ చేశారు. ఇలాగైనా వారు పనులను ప్రారంభిస్తారని అధికారులు ఆశించినా ఫలితం మాత్రం నామమాత్రంగానే ఉంది.

> **త్వరగా చేపట్టాలి**
>
> ఇళ్ల మంజూరు పత్రాలు తీసుకున్న లబ్ధిదారులు నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలి. ఎలాంటి సమస్యలు ఎదురైనా అధికారులు అందుబాటులో ఉంటారు. అవసరమైతే వారిని సంప్రదించొచ్చు. ఇళ్ల నిర్మాణపనుల్లో దళారులను నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చేవిధంగా పనులు చేపట్టాలి.
>
> – చందర్‌నాయక్, హౌసింగ్ డీఈ, కొడంగల్

ఇందిరమ్మ ఇళ్ల లెక్క ఇలా..

మండలంలో 287 ఇళ్ల మంజూరు పత్రాలను అధికారులు లబ్ధిదారులకు అందజేశారు. అందులో మార్కింగ్ చేసినవి 158, బేస్‌మెంట్ లెవెల్ 12 ఉన్నాయి. ఏది ఏమైనా ఈ పథకం ముందుకు సాగడానికి అధికార యంత్రాంగం శతవిధాలా ప్రయత్నిస్తుంది.

వరద నీటితో కోతకు గురైన పట్టా భూమి



కోతకు గురైన భూమి

- బెన్నూరు సమీపంలో చెక్ డ్యాం నిర్మాణ పనులతో రైతుకు నష్టం
- పంట పొలాల్లో చేరిన వరద
- పట్టించుకోని కాంట్రాక్టర్

యాలాల: బెన్నూరు సమీపంలో కాగ్నా నదిపై నిర్మించిన చెక్‌డ్యాంతో పక్క పొలాల రైతులు నష్టపోతున్నారు. చెక్‌డ్యాం నిర్మాణ సమయంలో పంట భూములు కోతకు గురి కాకుండా చెక్ డ్యాం పక్క వైపు నుంచి పైపులు వేయాల్సి ఉంది. కానీ ఆ దిశగా పనులు చేపట్టకపోవడంతో నేడు రైతుల భూములు కోతకు గురయ్యాయి. దీంతో ఈ ఏడాది వరిసాగు చేయాల్సిన పలువురి భూముల్లో వరద చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బెన్నూరు మాజీ సర్పంచ్ మల్లికార్జునరెడ్డికి చెందిన అర ఎకర, రైతులకు చెందిన 10 ఎకరాల్లో భారీగా వరదనీరు చేరింది. దీంతో ఈ ఏడాది వరి సాగు చేసేందుకు అవకాశం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చెక్‌డ్యాం నిర్మాణ సమయంలో ముందుగా పైపులు వేసి నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించినా పట్టించుకోలేదని బాధిత రైతులు వాపోతున్నారు. నిర్లక్ష్యంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం ఖాయం**

బంట్వారం: బీఆర్ఎస్‌కు పూర్వవైభవం ఖాయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ను వికారాబాద్‌లో పార్టీ శ్రేణులతో కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఎవరూ కూడా అధైర్యపడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **వరద బాధితులకు బియ్యం పంపిణీ**

బషీరాబాద్: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాలతో బషీరాబాద్ అధికార యంత్రాంగం కదిలింది. వరద ముంపునకు గురైన జీవన్గీ ఎస్సీ కాలనీలో పర్యటించి సహాయక చర్యలు చేపట్టింది. ఈ మేరకు తహసీల్దారు షాహెదబేగం, ఎంపీడీఓ తిరుమలస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, ఆర్ఐ నాగార్జున రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి, ఎస్సీ కాలనీలో పర్యటించి వరద బాధితులతో మాట్లాడారు. బాధితులకు పది కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు.

◆ **రేపు వీరాంజనేయస్వామి ఆలయ ప్రారంభం**

తాండూరు రూరల్: పెద్దేముల్ తండాలో శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్స వేడుకలను 14 నుంచి నిర్వహించనున్నట్లు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ధారాసింగ్ నాయక్, మాజీ సర్పంచు తారాభాయ్‌లు తెలిపారు. గురువారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, అంకురారోపణ కార్యక్రమాలతో పాటు ఆంజనేయ స్వామి, నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారని పేర్కొన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

◆ **విశ్వహిందూ కమిటీ నాయకుల అరెస్టు**

ధారూరు: విశ్వహిందూ కమిటీ నాయకులను మంగళవారం ధారూరు పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్‌లోని పెద్దమ్మతల్లి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుంకుమార్చనకు వెళ్లడానికి సిద్ధమైన వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అక్రమ అరెస్టును వారు ఖండించారు.

◆ **ఏజంట్ల వివరాలు అందజేయాలి**

కొడంగల్ రూరల్: అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ పరిధిలోని బూత్ లెవల్ ఏజంట్ల వివరాలను అందజేయాలని తహసీల్దార్ బి విజయ కుమార్ సూచించారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

◆ **సద్వినియోగం చేసుకోవాలి**

కుల్కచర్ల: విద్యార్థులు స్వచ్ఛంద సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని గర్ల్స్ ఫర్ చేంజ్ నిర్వాహకులు సునీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలవరలక్ష్మి అన్నారు. మంగళవారం బండవెల్కిచర్ల ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గర్ల్స్ ఫర్ చేంజ్ అనే సంస్థ సమాజంలో జరుగుతున్న మార్పు కోసం పోరాడుతుందన్నారు. బాల్యంలో సరైన మార్గదర్శనం లేకపోతే భవిష్యత్‌లో అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రతీ సంవత్సరం బాలికల కోసం రెండు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు.

◆ **ఎర్రసత్యంకు నివాళి**

తాండూరు రూరల్: గాజీపూర్ గ్రామంలో ఎర్రసత్యం వర్ధంతి నిర్వహించారు. మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ సర్పంచు వీరప్ప ముదిరాజ్ మాట్లాడుతూ..జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తు చేశారు. అబ్బని బసయ్య ముదిరాజ్, బుర్జుకాడి అంజిలప్ప, చెర్ల రాములు, అన్నసారం వెంకటయ్య పాల్గొన్నారు.

◆ **ఎమ్మార్పీఎస్ సభకు తరలిరండి**

తాండూరు రూరల్: తాండూరులో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు పెన్షనర్లు పెద్ద ఎత్తున తరలిరావాలని జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిములు మాదిగ పేర్కొన్నారు. మంగళవారం తాండూరు మండలం అల్లాపూర్, గౌతపూర్ గ్రామాల్లో పెన్షనర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నర్సిములు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో 16న నిర్వహించనున్న సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి జగదీష్ మాదిగ పాల్గొన్నారు.

◆ **ప్రమాదకరంగా ఏర్‌వాల్స్ గుంతలు**

మర్పల్లి: దామస్తాపూర్‌లో తాగునీటికోసం వేసిన పైప్‌లైన్ ఏర్‌వాల్ గుంతలు ప్రమాదకరంగా మారాయని గ్రామస్తులు వాపోతున్నారు. వారం రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి వరద నీరు ఏర్‌వాల్ గుంతల్లో చేరడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీంతో ఆయా కాలనీలకు ఇక్కడినుంచి వెళ్లాలంటే మిషన్ బగీరథ కోసం తీసిన ఏర్‌వాల్ గుంతల్లో పలువురు పడుతున్నారని చెబుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి, ఎంపీడీఓ కార్యాలయ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు

పరిగి: నియోజకవర్గంలో వివిధ మండలాల్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏపీఎంలు మంగళవారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయ మండలాల ఏపీఎంలు శోభ, రాజు, బాలకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘంపై విచారణ జరిపించాలి

దుద్యాల్: హస్నాబాద్ గ్రామంలో కొనసాగుతున్న మత్స్య సహకార సంఘంలో 40 ఏళ్లుగా అవినీతి జరుగుతుందని, వెంటనే విచారణ జరిపి న్యాయం చేయాలని మత్స్య శాఖ జిల్లా ఏడీఏ వెంకటయ్యను కాంగ్రెస్ కొడంగల్ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, జిల్లా కార్యదర్శి మల్లేశం మంగళవారం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన కార్యవర్గం ఏర్పాటు చేయాలంటే సంఘంపై అప్పులు ఉన్నాయని సాకులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏకపక్షంగా వ్యవహరిస్తూ మత్స్యకారులకు సంబంధించిన చెరువుపై వచ్చే ఆదాయంలో కొందరు మాత్రమే లబ్ధిపొందుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై వెంటనే విచారణ జరిపించాలని కోరారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు భీములు, గ్రామస్తులు, చంద్రప్ప, రాములు, రమేశ్, గోపి, చంద్రప్ప, ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

కొడంగల్ రూరల్: విద్యార్థులు స్నేహభావంతో మెలిగి, క్రమశిక్షణతో చదువుకోవాలని ఎస్ఐ జీవి సత్యనారాయణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ డే జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు పలు సూచనలు అందజేశారు. ర్యాగింగ్ చేయడం నేరమన్నారు. అందుకు ఆరు ఏళ్ల పైబడి జైలు శిక్ష ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ కో ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాస్, టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ రవీంద్ర యాదవ్



రాజీవ్ కాలనీలో రసాయనాలు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

తాండూరు టౌన్: డెంగీ సంక్రమించకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ రవీంద్ర యాదవ్ సూచించారు. మంగళవారం తాండూరు పట్టణ శివారులోని రాజీవ్ కాలనీలో ఓ వ్యక్తికి డెంగీ సోకిన విషయంపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ కాలనీకి డాక్టర్ అక్షయ్‌తో పాటు వైద్య సిబ్బందిని పంపించి సదరు వ్యక్తికి చికిత్స అందించామన్నారు. అలాగే పరిసరాల శుభ్రతపై ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు చేరకుండా చూసుకోవాలన్నారు. పూల కుండీలు, పాడైపోయిన టైర్లు, కొబ్బరి బోండాల్లో నీరు నిల్వ ఉంటే తొలగించాలన్నారు. అలాగే వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత అవసరమన్నారు.

పరిసరాల శుభ్రతపై పట్టింపేది ?

పట్టణంలోని గొల్లచెరువు, బెగ్గర్స్ కాలనీ, రాజీవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీతో పాటు పలు ప్రాంతాలు మురికి కూపంగా మారుతున్నా పట్టణ మున్సిపల్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. జూన్ నుంచి జూలై వరకు పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి 30 వరకు కేసులు నమోదైనట్లు సమాచారం. మున్సిపల్ సిబ్బంది చెత్త తొలగించడం, మురుగు కాల్వల శుభ్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారన్నారు. దోమల బెడద తగ్గించేందుకు ఎలాంటి ఫాగింగ్ ప్రక్రియ చేపట్టడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలోని వార్డుల్లో ఫాగింగ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

నియోజకవర్గ నాయకులు



ముదిరాజ్‌ల పోరాట సమితి ఆవిర్భావ సభకు హాజరైన నాయకులు

దుద్యాల్: ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని నియోజకవర్గ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని కండ్లకొయ్యలో ఏర్పాటు చేసిన ముదిరాజ్‌ల పోరాట సమితి ఆవిర్భావ సభకు పలు మండలాలకు చెందిన ముదిరాజ్ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ..ప్రతి ముదిరాజ్ బిడ్డ హక్కుల సాధనకు పోరాటాలు చేయాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు ఎక్కువ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన మడిగ శ్రీనివాస్, బొంబాయి రాములు, దుద్యాల అంజిలయ్య, శివరాజు, కూర వెంకటయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలి



శిక్షణ కార్యక్రమంలో శ్రీనివాస్ తదితరులు



దోమ: మాట్లాడుతున్న శోభ

ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్

యాలాల: స్వయం సహాయక సంఘాలలో లేని మహిళల వివరాలను సేకరించి, కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఐకేపీ కార్యాలయంలో నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటు విషయమై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతో ప్రణాళిక చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా కొత్తగా వివాహమై వచ్చిన వారి వివరాలను సేకరించి సంఘాల్లో చేర్చుకోవాలన్నారు. వీరితో పాటు సదరం వివరాలు సేకరించి పీడబ్ల్యూడీ సంఘాలు, కిషోర బాలికలు (15 సంవత్సరాల నుంచి 18 ఏళ్ల లోపు బాలికలు), వృద్ధుల గ్రూపు (60 సంవత్సరాలు దాటిన వారు) చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ నెలాఖరు లోపు ఆయా కేటగిరిల వారీగా గుర్తించి కొత్త గ్రూపులను ఏర్పాటు చేసేలా ఖాతాలు తెరవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీలు బందెప్ప, వెంకటయ్య, సిబ్బంది చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి: ఎంపీడీఓ గ్యామా

దోమ: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఎంపీడీఓ గ్యామా, ఏపీఎం శోభ తెలిపారు. మంగళవారం దోమ మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామ సంఘాల పదాధికారులు, గ్రామ సంఘం సహాయకులకు ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో నూతన సంఘాల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అర్హులైన మహిళలు, వృద్ధులు, కిశోర బాలికలు, దివ్యాంగులను గుర్తించి నూతన సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో సోషల్ మ్యాప్ ద్వారా గుర్తించి పేద వారిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్, గ్రామ సంఘం ఓబీ సభ్యులు, సీసీలు నారాయణ, లక్ష్మారెడ్డి, సుజ్ఞాణి, జంగయ్య, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పరాభవం తప్పదు

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి




మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి


ధారూరు: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పరాభవం తప్పదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. రాంపూర్‌తండా, గట్టెపల్లి, రుద్రారంలో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ నేటికి అమలు చేయలేదని విమర్శించారు. 20 నెలల నుంచి ప్రజలకు అబద్ధాలు చెబుతూ వస్తుందే తప్పా అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. రూ. 2లక్షల రుణమాఫీ, రూ.15 వేలు ఇస్తామన్న రైతు భరోసాను తగ్గించడం, కౌలు రైతుల్ని మోసం చేయడం, వృద్ధులకు రూ. 4వేల ఫించన్ వంటి హామీలను అమలు చేయడంలో చేతులెత్తేశారని మండిపడ్డారు. ప్రతీ మహిళకు రూ. 2,500, విద్యార్థినులకు స్కూటీ పంపిణీ ఏమైందని ప్రశ్నించారు. సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగ భర్తీ ఎక్కడికిపోయిందన్నారు. బీసీ రిజర్వేషన్, హైడ్రాతో డ్రామాలాడుతున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సంతోష్‌కుమార్, చంద్రమౌళి, బీఆర్ఎస్ నాయకులు రాములు, దేవేందర్, వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మయ్య, హఫీజ్, విజయకుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణు గోపాల్



దుద్యాల్: సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు



దోమ: సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న మాజీ సర్పంచ్ అనంతయ్య

దుద్యాల్: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చెట్టుపల్లి తండాకు చెందిన చౌహాన్ విఠల్ నాయక్‌కు రూ. 50వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమానికి తోడ్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు రమేశ్ రాథోడ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదల పెన్నిధి

దోమ: సీఎం సహాయనిధి పేదల పెన్నిధి అని బాసపల్లి మాజీ సర్పంచ్ అనంతయ్య పేర్కొన్నారు. దోమ మండల పరిధిలోని బాస్‌పల్లిలో పెంటమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. ఈ విషయాన్ని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి సీఎం సహాయనిధి కింద రూ.23 వేల చెక్కును మంజూరు చేయించారు. అంతేకాకుండా బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన హన్మయ్యకు కూడా రూ. 60వేలు మంజూరు చేయించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నేతలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమాలను పార్టీలకు అతీతంగా ప్రతి పేద కుటుంబానికి అందించేలా ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఆయన అండగా ఉండి ఆదుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు తెలుగు వెంకటయ్య, కాంగ్రెస్ నేతలు రాఘవేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, గోపాల్, నర్సింహులు, శ్రీశైలం, శ్రీను, నర్సింహా, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.